



# విభారె

## తెలుగు దినపత్రిక

## VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 30-03-2024 సంపుటి : 06 సంచిక : 200 పేజీలు : 8 వెల : రూ 3-00


## మూడో రోజు బస్సు యాత్ర జనంతో జగన్.. కొనసాగుతోన్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర..

# జగన్ యాత్రకు జనం నీరాజనం..







కర్నూలు మార్చి 29( విభారె) ఎన్నికల ప్రచారంలో అడుగుపెట్టిన ఏపీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్రకు బిగ్ రెస్పాన్స్ వస్తోంది. తమ అభిమాన నాయకుడు జనం ముందుకు రావడంతో సెల్ఫీలు దిగుతూ, సందడి చేస్తూ యాత్రను విజయవంతం చేస్తున్నారు.కర్నూలు జిల్లా కోడుమూరులో సీఎం జగన్ బస్సు యాత్ర కొనసాగుతోంది. జగన్ యాత్రకు జనం అడుగడుగున నీరాజనం పడుతున్నారు. యాత్రలో పెద్ద ఎత్తున పాల్గొంటున్న జనం పూలతో స్వాగతం పలుకుతున్నారు.వేమగోడులో వైసీపీ జెండాలు చేతపట్టి జగన్‌కు స్వాగతం పలికారు విద్యార్థులు. తమ మేనమామ సీఎం జగన్ అంటూ విద్యార్థులు నినదించారు.కోడుమూరులో జగన్‌కు చేనేత మగ్గం గిఫ్ట్‌గా ఇచ్చారు చేనేతలు. సంక్షేమ పథకాలతో మేలు జరిగిందంటూ అభిమానం చాటుకున్నారు. మళ్లీ జగన్ రావాలంటూ నినాదాలు చేశారు.జగన్‌కు గొర్రె పిల్లను ఇచ్చి అభిమానం చాటుకున్నారు గొర్రె కాపారులు. కోడుమూరులో సాగుతున్న జగన్ యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు.సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్ర మూడో రోజు కర్నూలు జిల్లాలో ప్రారంభం కానుంది. పెంచికలపాడు నుంచి ప్రారంభమైన సీఎం జగన్ బస్సు యాత్ర.. భారీ జనం మధ్య కొనసాగుతోంది.పెంచికలపాడు శిబిరం నుంచి తమ ప్రాంతానికి వస్తున్న జగన్ యాత్రకు స్వాగతం పలుకుతున్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగుతున్నారు.సీఎం జగన్ వెంట మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎంపి హాఫీజ్ ఖాన్, డా.జరదొడ్డి సుధాకర్, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ఉన్నారు.ఈ సందర్భంగా సీఎం జగన్ బస్సు దిగి ప్రజలను అప్యాయంగా పలకరిస్తున్నారు. సీఎం జగన్ కు వారి సమస్యలను పరిష్కరించాలని కోరగా.. సానుకూలంగా స్పందిస్తూ... వెంటనే అధికారులను ఆదేశిస్తున్నారు.పలు ప్రాంతాల్లో జగన్ కు జనం నీరాజనం పలుకుతూ .. జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్నారు. మొత్తంగా.. జనంతో మమేకం అవుతూ, జనం సమస్యలు తెలుసుకుంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీస్తూ సాగుతోంది సీఎం జగన్ బస్సు యాత్ర.కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ.. మూడు నియోజకవర్గాల్లో కొనసాగనుంది ఇవాళ్టి యాత్ర. మధ్యాహ్నం ఎమ్మిగనూరులో నిర్వహించే సభ కోసం అంతా సిద్ధమైంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి జన సమీకరణకు వైసీపీ కసరత్తు చేస్తోంది. ఎమ్మిగనూరు నుంచి ఆదోని, ఆస్పరి మీదుగా పత్తికొండ చేరుకోనుంది జగన్ బస్సు యాత్ర. రాత్రి పత్తికొండ మండలం రాతన గ్రామంలో జగన్ బస చేస్తారు. జిల్లా ముఖ్య నేతలతో భేటీ అవుతారు. సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర (మేమంతా సిద్ధం- నాలుగో రోజు) కర్నూలు, అనంతపురం జిల్లాలలో కొనసాగనుంది.కర్నూలు జిల్లా రాతన నైట్ హాల్ట్ నుంచి బయలుదేరి తుగ్గలి చేరుకుంటారు, అక్కడ ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి బయలుదేరి గరిగెట్ల క్రాస్ మీదుగా జొన్నగిరి చేరుకుంటారు, అక్కడి నుంచి బయలుదేరి బసినేపల్లి, గుత్తి, పామిడి, గార్లదిన్నె, రాప్తాడు, ఇటికలపల్లి మీదుగా క్రిష్ణంరెడ్డిపల్లి నైట్‌హాల్ట్‌కు చేరుకుంటారు.




అమరావతి మార్చి 29 ( విభారె) : ఏపీలో టీడీపీ ఫైనల్ అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఇప్పటి వరకు ప్రకటించని పెండింగ్?లో ఉన్న పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది.ఆంధ్రప్రదేశ్?లో అధికారమే లక్ష్యంగా టీడీపీ ముందుకు సాగుతోంది. ఎన్డీయేతో పొత్తు పెట్టుకుని ఎన్నికల శంఖారావాన్ని మోగించింది. మొన్నటి వరకు చిత్తూరు జిల్లాలో పర్యటించిన టీడీపీ అధినేత చంద్రబాబు, ప్రస్తుతం కర్నూలు జిల్లా బనగాన పల్లెలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే తెలుగుదేశం పార్టీ మొత్తం 144 అసెంబ్లీ, 17 లోక్ సభ స్థానాలకు గాను ఇప్పటి వరకు 139 మంది శాసనసభ, 13 లోక్ సభ అభ్యర్థులను ప్రకటించింది.మిగిలిన 9 అసెంబ్లీ, 4లోక్‌సభ స్థానాలకు క్యాండిడేట్ల జాబితాను విడుదల చేసింది. గత కొంత కాలంగా చీపురుపల్లి నుంచి గంటా శ్రీనివాసరావు పోటీ చేయాలని నిర్ణయించినప్పటికీ చివరికి ఆ స్థానాన్ని కళా వెంకట్రావుకు కేటాయించారు. ఈ సీటుపై కళా వెంకట్రావు వర్గం ఆందోళనలు కూడా చేసింది. అలాగే కదిరి నియోజకవర్గంలో ముందుగా యశోద పేరును అనుకున్నప్పటికీ ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే ప్రసాద్ కు అవకాశాన్ని ఇచ్చింది.

**అసెంబ్లీ అభ్యర్థులు..**రాజంపేట- సుగవాసి సుబ్రహ్మణ్యం, అనంతపురం అర్బన్- దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్,కదిరి-కందికుంట వెంకట ప్రసాద్, ఆలూరు- వీరభద్ర గౌడ్,గుంతకల్లు- గుమ్మనూరు జయరామ్, చీపురుపల్లి- కళా వెంకట్రావు భీమిలి- గంటా శ్రీనివాసరావు,పాడేరు- కె. వెంకటరమేశ్ నాయుడు,దర్శి- గొట్టిపాటి లక్ష్మి

**పార్లమెంట్ అభ్యర్థులు..:**కడప-భూపేష్‌రెడ్డి,అనంతపురం- అంబికా లక్ష్మీనారాయణ, ఒంగోలు- మాగుంట శ్రీనివాసులురెడ్డి, విజయనగరం- కలిశెట్టి అప్పలనాయుడు

# కర్నూలు జిల్లాలో ప్రజాగళం యాత్ర..



కర్నూలు మార్చి 29(( విభారె) ) ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రచార యాత్రలు జోరందుకున్నాయి. నిన్నమొన్నటి వరకు చిత్తూరు జిల్లాలో పర్యటించిన టీడీపీ అధినేత చంద్రబాబు ప్రస్తుతం కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్నారు.రాజ బనగానపల్లె?లో ప్రజా గళం సభలో చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించడానికి ఎన్డీయేతో జట్టుకట్టామన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాడే ఎమ్మార్పీఎస్ కూడా కలిసింది తమతో కలిసిందని పేర్కొన్నారు. క్రీస్తుశకం ఎలాగో తెలుగుదేశం శకం కూడా అలాగే అంటూ టీడీపీ 42 ఏళ్లు పూర్తిచేసుకుందని పార్టీ ప్రస్థానాన్ని వివరించారు. అన్ని వర్గాలకు న్యాయం చేయాలన్నదే తన సంకల్పంగా చెప్పారు చంద్రబాబు. సంపద సృష్టించి పేదలకు పంచాలన్నదే తన లక్ష్యమన్నారు.విద్యుత్ సంస్కరణలు, టెక్నాలజి టీడీపీ చలువే అని కొనియాడారారు. గోదావరి జలాలు రాయలసీమకు తెచ్చి ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలన్నదే తమ పార్టీ లక్ష్యం అన్నారు. ఈ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడిందని విమర్శిచారు. పేదలకు అండగా ఉంటాం, వారికోసమే పనిచేస్తామని హామీ ఇచ్చారు. ప్రపంచంలోనే తెలుగు జాతికి గుర్తింపురావాలని తెలిపారు. టీడీపీ ఏమి చేసిందన్న జగన్ ప్రశ్నకు సమాధానమిస్తా అయితే జగన్ హయాంలో అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారో మీరు చెబుతారా అంటూ వైసీపీకి సవాల్ విసిరారు. సీఎం ఇచ్చేది పది రూపాయలు అయితే దోచేది 100 రూపాయలు అని ఆరోపించారు. ఈ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికులకు పని లేకుండా పోయింది. దీనికి కారణం ఇసుక కృత్రిమ కొరత అని తెలిపారు.వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించడానికి తాను వచ్చానన్నారు. అయితే జగన్ ప్రభుత్వాన్ని ఓడించేందుకు మీరు సిద్ధమా అని ప్రజలను ప్రశ్నించారు. జగన్ సభలకు కూలి ఇచ్చి ప్రజలను తీసుకువెళ్లారని ఆరోపించారు. ప్రజాలను ఆదుకోవడం నా మార్కు అయితే.. జనాలను మోసం చేయడం జగన్ మార్కు అంటూ తీవ్రంగా విమర్శించారు. వాలంటీర్ల వ్యవస్థను తీసేయనని, ద్రోహం చేస్తే వదిలిపెట్టనని హెచ్చరించారు. చదువుకున్న వాలంటీర్లకు స్కిల్ డెవలప్?మెంట్ చేసి రూ.50 వేలు జీతం వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. బీజేపీ, జనసేన, టీడీపీల కలయిక భావితరాల కోసం అని వివరించారు. ఎన్డీయేలో ముస్లిం సోదరులకు అన్యాయం జరగదు.. గతంలో రెండు సార్లు ఎన్డీయేలో ఉన్నపుడు ముస్లింలకు అన్యాయం జరిగిందా అని అడిగారు.

# ఏఐ అనేది ఓ మ్యాజిక్ టూల్, సరైన విధంగా వాడుకోవాలి - బిల్‌గేట్స్‌తో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, మార్చి 29 ( విభారె) ప్రధాని నరేంద్ర మోదీ, మైక్రోసాఫ్ట్ కో ఫౌండర్ బిల్ గేట్స్‌తో ఇంటరాక్ట్ అయ్యారు. ఏఐ టెక్నాలజీ నుంచి డిజిటల్ చెల్లింపుల వరకూ పలు కీలక అంశాలపై మాట్లాడుకున్నారు. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ ఏఐ టెక్నాలజీ గురించి ప్రస్తావించారు. సరైన ట్రైనింగ్ ఇవ్వకపోతే ఈ సాంకేతికతను చాలా మంది దుర్వినియోగం చేసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీని సరిగ్గా వాడితే అంతకు మిచ్చిన మ్యాజిక్ టూల్ ఏమీ ఉండదని అన్నారు. ఏఐ తో జనరేట్ చేసిన కంటెంట్‌కి కచ్చితంగా వాటర్‌మార్క్ వేయాలని, తద్వారా డీప్‌ఫేక్ సమస్య నుంచి బయటపడేందుకు అవకాశముంటుందని సూచించారు. "ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లాంటి మంచి టెక్నాలజీని సరైన శిక్షణ ఇవ్వకుండానే చేతుల్లో పెడితే కచ్చితంగా దుర్వినియోగం అవుతుంది. ఏఐతో జనరేట్ చేసిన కంటెంట్‌పై కచ్చితంగా వాటర్ మార్క్ వేయాలి. అలా అయితేనే దాన్ని మిస్‌యూజ్ చేయకుండా అడ్డుకోగలం. భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా డీప్‌ఫేక్ టెక్నాలజీని వాడేందుకు వెసులుబాటు ఉంది. అసలు ఈ డీప్‌ఫేక్ కంటెంట్‌ని గుర్తించడమే సవాల్‌గా ఉంది. కచ్చితంగా ఈ టెక్నాలజీపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలి"ఇటీవల కొంత మంది ప్రముఖుల వీడియోలు డీప్‌ఫేక్ టెక్నాలజీతో క్రియేట్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు

## టీడీపీలో ప్రకంపనలు.. కిమిడి నాగార్జున రాజీనామా

విజయనగరం జిల్లా మార్చి 29(( విభారె) : చీపురుపల్లి టికెట్ కళా వెంకట్రావుకు కేటాయించడంపై విజయనగరం టీడీపీలో ప్రకంపనలు రేగుతున్నాయి. చీపురుపల్లి టికెట్ రాకపోవడం పట్ల మనస్తాపం చెందిన విజయనగరం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున పార్టీకి రాజీనామా చేశారు.చీపురుపల్లి టీడీపీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ కరపత్రాలు, పోస్టర్లను కార్యకర్తలు దహనం చేశారు. బాబు, లోకేష్ అచ్చెన్నాయుడు మోసగాళ్లంటూ నినాదాలు చేశారు. పార్టీని నమ్ముకున్న వారికి టికెట్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కళా వెంకట్రావుకు సహకరించేది లేదని టీడీపీ శ్రేణులు చెబుతున్నారు.



# డూ ఆర్ డై లా చంద్రబాబు



హైదరాబాద్, మార్చి 29 తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు ఈసారి ఎన్నికలు చావోరేవో సమస్య. ఆయన అధికారంలోకి వస్తేనే పార్టీ మనుగడ ఉంటుంది. లేకుంటే పొరుగున ఉన్న బీఆర్ఎస్ పరిస్థితికి ఏ మాత్రం తీసిపోదు. అది ఆయనకు తెలుసు. వయసు రీత్యా చంద్రబాబు కూడా ఇక ఐదేళ్లలో పార్టీని బలోపేతం చేసే అవకాశముండదు. మరో వైపు ఇది ఆఖరి ప్రయత్నం. ఎందుకంటే ఇప్పుడు గెలవకుంటే.. ప్రజలు టీడీపీని సుదీర్ఘకాలం ఆదరించారన్న భయం కూడా పార్టీ నేతల్లో నెలకొంది. అందుకే ఈ ఎన్నికల్లో డూ ఆర్ డై లా చంద్రబాబుతో పాటు పార్టీ నేతలు కూడా పోరాడాల్సి ఉంటుందన్నది అందరూ అంగీకరించే విషయమే. ఏపీలో ప్రస్తుతం కూటమి ఏర్పడింది. టీడీపీ బలమైన పార్టీ. క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్లో పటిష్టమైన క్యాడర్ ఉన్న పార్టీ. దశాబ్దాలుగా ప్రజల్లో ఉండటమే కాకుండా అధికారంలో కూడా ఎక్కువ సార్లు ఉన్న జెండా అది. దీనికి తోడు బలమైన సామాజికవర్గం, ఏపీలో అత్యధిక సామాజికవర్గం కాపు ఓటర్లు మద్దతు ఉందని భావిస్తున్న జనసేన కూడా మిత్రపక్షంగా ఉంది. కేవలం పవన్ కల్యాణ్ సినీ హీరోనే కాకుండా కులం పరంగా ఓట్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావడమే కాకుండా క్రౌడ్ పుల్లర్ గా పేరుంది. ఈ ఇద్దరికి తోడు మోదీ చరిష్మా ఉండనే ఉంది. అయోధ్య ఆలయ నిర్మాణంతో మరింత పీక్స్ కు చేరుకుంది. దీంతో ముగ్గురు కలసి మళ్లీ పోటీ చేస్తున్నారు. ఈ మూడు పార్టీలు కలసి పోటీ చేసి విజయం సాధిస్తే ఓకే. ఎందుకంటే 2014 రిజల్ట్ రిపీట్ అయ్యానని చెప్పుకునే వీలుంది. అలా కాకుండా ఏమాత్రం తేడా కొట్టినా ఇక కూటమి కట్టినా జనం ఆదరించలేదన్న అభిప్రాయం బలంగా పడుతుంది. ఇతర పార్టీలు కూడా చంద్రబాబును నమ్మే పరిస్థితి ఉండదు. ఇప్పటి వరకూ ఆయన చాణక్యుడని, ఆయన వ్యూహాలకు తిరుగులేదని క్యాడర్ నుంచి నేతల వరకూ నమ్ముతున్నారు. ఈసారి కూటమి విఫలమయితే మాత్రం క్యాడర్ కూడా బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. అందుకే చంద్రబాబుకు ఈ ఎన్నిక జీవన్మరణ సమస్య. ఏ అవకాశాన్ని చేజార్చుకోకుండా జగన్ పార్టీని దెబ్బకొట్టేందుకు జెండాలన్నింటినీ కలిపి మరీ బరిలోకి దిగుతున్నారు. సభలో అడుగుపెట్టనుంటూ... మరోవైపు అతి పెద్ద ఇబ్బంది ఆయన శపథం. తాను మళ్లీ ముఖ్యమంత్రిగానే సభలోకి అడుగుపెడతానని శపథం చేసి మరీ శాసనసభ నుంచి బయటకు వచ్చారు. ఆ తర్వాత శాసనసభ గడప తొక్కలేదు. ఈ ఎన్నికల్లో కూటమి గెలిస్తే చంద్రబాబు ముఖ్యమంత్రిగా సభలోకి అడుగుపెట్టే అవకాశముంటుంది. అది జరగకుంటే మాత్రం ఆయన సభకు కూడా వచ్చే అవకాశం లేదు. ఇప్పుడు టీడీపీ అభిమానుల్లో అదే ఆందోళన నెలకొని ఉంది. శపథం నెరవేరాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిందే. అందుకు కార్యకర్తలు చెమటోడ్చాల్సిందే. ఇన్ని కారణాలు ఇప్పుడు టీడీపీ క్యాడర్ ను, అభిమానులు వేధిస్తున్నాయి. మరి ఏపీ ప్రజల తీర్పు ఎలా ఉంటుందన్నది చూడాల్సి ఉంది.

# కొవ్వూరులో ఉచిత ప్రచారం

నెల్లూరు, మార్చి 29నెల్లూరు, జిల్లా రాజకీయాల్లో సంచలన ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి. కోవూరు నియోజకవర్గం నుంచి ఆయనకు జయాలు, పరాజయాలు రెండూ ఉన్నాయి. నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి తనయుడిగా నెల్లూరు రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తండ్రి మంత్రి, తాను కూడా మంత్రిగా చేశారు. ప్రస్తుతం కాలం కలసిరాక ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఏపీ సీఎం వైఎస్ జగన్ హయాంలో మినిస్టర్ పోస్ట్ వస్తుందనుకుంటే రెండుసార్లూ ఆయనకు నిరాశే ఎదురైంది. చివరకు చేసేదేం లేక ఈసారయినా అవకాశం వస్తుందేమోనని ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో ఆయనకు అనుకోకుండా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ప్రత్యర్థి అయ్యారు. దీంతో కాస్త ఆందోళనలో ఉన్న ప్రసన్న.. ఘాటు వ్యాఖ్యలతో రచ్చకెక్కారు. నెల్లూరులో ప్రత్యర్థులపై బాగా నోరు చేసుకునే నాయకుల్లో ప్రసన్న కుమార్ రెడ్డి ఒకరు. గతంలో టీడీపీలో మంత్రిగా పనిచేసిన ఆయనకు చంద్రబాబు అంటే అస్సలు పడదు. వైసీపీలో చేరిన తర్వాత చంద్రబాబుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు, చేస్తూనే ఉన్నారు. టీడీపీనేతలందరిపై కూడా ప్రసన్న ఘాటు వ్యాఖ్యలు చేసేవారు. తాజాగా వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వ్యక్తిగత జీవితంపై ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రెండో భర్త వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అంటూ ఆమె వ్యక్తిగత జీవితాన్ని తెరపైకి తెచ్చారు ప్రసన్న. అయితే ఈ విమర్శలు ఆయనకు తీవ్ర నష్టం కలిగించేలా ఉన్నాయి. ప్రసన్న వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగింది. వీపీఆర్ చాన్నాళ్లుగా రాజకీయాల్లో ఉన్నా కూడా ఎప్పుడూ తన వ్యక్తిగత వివరాలను బయటపెట్టలేదు. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కూడా తన వివాహం గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. కానీ ప్రసన్న కుమార్ రెడ్డి వ్యాఖ్యల తర్వాత ప్రశాంతి రెడ్డి మరింత ధైర్యంగా ప్రజల్లోకి వచ్చారు. తన గురించి తాను చెప్పుకున్నారు. తన మొదటి భర్త ఎవరు, తాను వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఎందుకు వివాహం చేసుకోవలసి వచ్చిందనే విషయాన్ని బహిర్గతం చేశారు. విమర్శకుల నోళ్లు ఒకేసారి మూయించారు. దీంతో ఆమెకు కోవూరులో మరింత ప్రచారం లభించింది. వ్యక్తిగత వ్యాఖ్యలతో ఆమె కుంగిపోకుండా ధైర్యంగా ప్రజల ముందుకొచ్చినందుకు ఆమెను అందరూ అభినందిస్తున్నారు. ప్రసన్న కుమార్ రెడ్డి వ్యాఖ్యల అనంతరం ప్రశాంతి రెడ్డి ధైర్యంగా నిలబడ్డారని, నారా లోకేష్ కూడా అభినందించారు. ఆమె వీడియోను తన ట్విట్టర్ లో పోస్ట్ చేశారు. లోకేష్ ట్వీట్ తో ప్రశాంతి రెడ్డి వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. రాజకీయాల్లో ఉన్న మహిళల గురించి వైసీపీ ఎమ్మెల్యే నీఛంగా మాట్లాడారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. ప్రసన్న వ్యాఖ్యల్ని నెల్లూరు టీడీపీ నేతలంతా ముక్త కంఠంతో ఖండించారు. ఇప్పుడు వైసీపీ నుంచే కొందరు ప్రసన్న వ్యాఖ్యలను తప్పుబడుతున్నారు.ప్రసన్న వ్యాఖ్యలకు మద్దతుగా వైసీపీ నేతలెవరూ స్పందించలేదు. కనీసం ఆయన మాట్లాడుతున్నప్పుడు పక్కనే ఉన్న నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి కూడా ఆ తర్వాత ఆ వ్యాఖ్యల జోలికే వెళ్లేదు. దీంతో ఒకరకంగా ప్రసన్న కుమార్ రెడ్డి నెల్లూరు వైసీపీలో ఒంటరిగా మారారు. ప్రత్యర్థి ప్రశాంతి రెడ్డిని మానసికంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే ప్రసన్న ఆ వ్యాఖ్యలు చేశారని అంటున్నారంతా. అయితే ప్రసన్న వ్యాఖ్యలతో ఆయన అనుకున్నది సాధ్యం కాకపోగా.. ఆయన ప్రత్యర్థి ప్రశాంతి రెడ్డిపై సింపతీ పెరిగింది. ఆమెకు ఊహించని మద్దతు లభించింది.

# కమ్యూనిస్టు కోటలో పాగా ఎవరిది..

విజయవాడ, మార్చి 29 ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం అసెంబ్లీ నియోజకవర్గం 1955లో ఏర్పాటు చేయగా.. తొలుత కమ్యూనిస్టులు ప్రభావం చూపారు. ఆ తర్వాత కాంగ్రెస్కంచుకోటగా మారింది. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ అభ్యర్థులు పాగా వేయగా....ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఆయన తెలుగుదేశం పార్టీలో చేరి ఆ పార్టీ నుంచి బరిలో దిగారు.ఆంధ్రరాష్ట్ర ఆవిర్భావం అనంతరం 1955లో మైలవరం కేంద్రంగా కొత్త నియోజకవర్గం ఏర్పాటైంది. ఆ రోజుల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా( వ్యాప్తంగా వామపక్షాల ప్రభావం అధికంగా ఉండటంతో...ఇక్కడ సైతం సీపీఐ పార్టీ అభ్యర్థి వెల్లంకి విశ్వేశ్వరరావు కేవలం 84 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి పెదర్ల వెంకటసుబ్బయ్యపై విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన 1962 ఎన్నికల్లోనూ అదే అభ్యర్థులు పోటీపడగా..సీపీఐ ఈ సీటు నిలబెట్టుకుంది. అప్పుడు విశ్వేశ్వరరావు 514 ఓట్లతో విజయం సాధించారు. 1967లో తొలిసారి కాంగ్రెస్ తరపున చనుమోలు వెంకట్రావుజయకేతనం ఎగురవేశారు. దాదాపు 20వేల ఓట్ల మెజార్టీ సాధించారు....1972, 78లోనూ విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు.తెలుగుదేశం ఆవిర్భావంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ ప్రభావం చూపగా....ఆ పార్టీ తరఫున నిమ్మగడ్డ సత్యనారాయణ విజయం సాధించారు. 4వేల 200 ఓట్ల మెజార్టీతో చనుమోలు వెంకట్రావుపై గెలుపొందారు. ఆ తర్వాత 1985లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ చనుమోలు వెంకట్రావు నిమ్మగడ్డ సత్యనారాయణను ఓడించారు.. 1989లో కోమటి భాస్కర్‌రావు కాంగ్రెస్ తరఫున....తెలుగుదేశం నుంచి జేష్ఠ రమేశ్‌బాబు పోటీపడగా...కాంగ్రెస్‌ను విజయం వరించింది. 1994 లో రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం గాలి వీయడంతో మైలవరంలోనూ ఆ పార్టీ అభ్యర్థి జేష్ఠ రమేష్ 7వేల ఓట్లకుపైగా మెజార్టీతో గెలుపొందారు.1999లో విజయవాడ సిట్టింగ్ ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావుకు తెలుగుదేశం టిక్కెట్ కేటాయించగా...కాంగ్రెస్ నుంచి కోమటి సుబ్బారావుపై విజయం సాధించారు. 2004లో రాజశేఖర్‌రెడ్డి పాదయాత్రతో రాష్ట్రంలో కాంగ్రెస్ జయకేతనం ఎగురవేయగా...ఆ పార్టీ సీనియర్ కాంగ్రెస్ నుంచి చనుమోలు వెంకట్రావు ఐదోసారి గెలుపొందారు. 2009లో తెలు?దేశం నుంచి దేవినేని ఉమామహేశ్వరరావు పోటీపడగా... కాంగ్రెస్ అభ్యర్థి సందీప్‌పై విజయం సాధించారు. నందిగామ ఎస్సీ రిజర్వ్‌డు కావడంతో దేవినేని ఉమ మైలవరం నుంచి బరిలో దిగాల్సి వచ్చింది.రాష్ట్ర విభజన అనంతరం 2014లో వరుసగా రెండోసారి గెలిచిన దేవినేని ఉమ...చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. మూడోసారి మైలవరం నుంచి దేవినేని ఉమ పోటీపడగా...గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా వసంత కృష్ణప్రసాద్ రంగంలోకి దిగి విజయం సాధించారు. తదనంతర పరిణామాల్లో వసంత కృష్ణ ప్రసాద్ వైసీపీ వీడి తెలుగుదేశం పార్టీలో చేరగా...ప్రస్తుతం మైలవరం టిక్కెట్ ఆయకే కేటాయించారు. వైసీపీ తరఫున సరనాల తిరుపతిరావు యాదవ్ బరిలో దిగారు. ఆర్థికంగా బలమైన అభ్యర్థి వసంతపై తిరుపతిరావు యాదవ్ ఏ మేరకు నెట్టుకురాగలరో చూడాలి.మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం మండలాలతోపాటు విజయవాడ రూరల్ మండలంలో కొంత భాగం మైలవరం నియోజకవర్గం కిందకు వస్తుంది.

# పిల్లి..పిల్లి పోరు... బీజేపీ...

అనంతపురం, మార్చి 29,ధర్మవరం అసెంబ్లీ నియోజకవర్గం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అవతల బలమైన అభ్యర్థి వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఉన్నారు. ఈ సమయంలో ధర్మవరం టిక్కెట్ పంచాయతీలో ఇద్దరు నేతలు కొట్లాడుకోగా మధ్యలో మరొక వ్యక్తి టిక్కెట్ ను ఎగరేసుకుపోయారు. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ లు తమకు టిక్కెట్ కావాలంటే తమకు కావాలంటూ ఇద్దరూ అమితుమీకి దిగారు. మీడియా సమావేశాలు పెట్టి మరీ ఒకరిపై ఒకరు బురద జల్లుకున్నారు. ఒకరి గురించి మరొకరు తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు. ఇద్దరూ బలమైన నేతలు కావడంతో ఎవరో ఒకరికే వస్తుందని అందరూ అనుకున్నారు.. అదే సమయంలో ధైర్యం బీజేపీలో చేరడంతో... 2014లో వరదాపురం సూరి టీడీపీ నుంచి ధర్మవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2019 ఎన్నికలలో ఓటమి తర్వాత ఆయన అనూహ్యంగా టీడీపీని వీడి బీజేపీలో చేరిపోయారు. తనకు బీజేపీలో ఉంటే అన్ని రకాలుగా రక్షణ ఉంటుందని నమ్మి ఆయన ఆ పార్టీ కండువా కప్పేసుకున్నారు. దీంతో చంద్రబాబునాయుడు ధర్మవరానికి పరిటాల శ్రీరామ్ ను ఇన్‌ఛార్జిగా నియమించారు. నాలుగేళ్ల నుంచి పరిటాల శ్రీరామ్ ధర్మవరంలో పార్టీ బాధ్యతలను చూసుకుంటున్నారు. టీడీపీ క్యాడర్ బయటకు వెళ్లకుండా అంతా తానే అయి పార్టీ జెండాను అక్కడ నిలబెడుతూ వచ్చారు. అదే సమయంలో అక్కడ జనసేన కూడా బలంగానే ఉంది. కుటుంబానికి ఒకే టిక్కెట్... టీడీపీ అధినేత చంద్రబాబు మాత్రం కుటుంబంలో ఒకరికే టిక్కెట్ ఇవ్వాలని నిర్ణయించారు. ఫ్యామిలీ ప్యాక్ ఉండబోదని కొద్దిరోజుల క్రితం పరిటాల కుటుంబానికి సూత్రప్రాయంగా తెలిపారు. రాప్తాడు నుంచి పరిటాల సునీతను అభ్యర్థిగా ప్రకటించారు. అయితే తాను ఇన్ని రోజులు పడిన కష్టానికి టిక్కెట్ ఇవ్వాలంటూ పరిటాల శ్రీరామ్ టీడీపీ అధినేతకు పదే పదే కోరారు. అయినా అక్కడ ప్రత్యేక పరిస్థితుల కారణంగా తాను టిక్కెట్ ఇవ్వలేమని చెప్పారు.

# వెంకటగిరిలో వాళ్లు.. వీళ్లు...వీళ్లు.. వాళ్లు

నెల్లూరు, మార్చి 29 ఏపీ ఎన్నికల్లో వైసీపీ వర్సెస్ కూటమి పోరులో కొన్ని చోట్ల అంతర్గత రాజకీయాలు చాలా ప్రభావం చూపిస్తున్నాయి. ఒక్కోచోట ఒక్కో పార్టీలోనే సమస్యలు ఉంటే.. ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరిలో మాత్రం రెండు పార్టీల్లోనూ సమస్యలున్నాయి. ఇక్కడ వైసీపీలో వర్గపోరు తారాస్థాయికి చేరుకుంది. ఇక టీడీపీలో ఏకంగా టికెట్ ఆశించి భంగపడిన నాయకుడు వైసీపీ కండువా కప్పుకున్నారు. దీంతో ఈ నియోజకవర్గం టాక్ ఆఫ్ ది స్టేట్ గా మారింది. ఇంటిపోరుని త్వరగా పరిష్కరించుకోగలిగే పార్టీకే ఇక్కడ విజయం వరించే అవకాశాలున్నాయి.2019లో ఇక్కడ వైసీపీ తరపున ఆనం రామనారాయణ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత వివిధ కారణాలతో ఆయన పార్టీకి దూరమయ్యారు. కాలక్రమంలో టీడీపీలో చేరి, ప్రస్తుతం ఆత్మకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. అంటే ఆయనకు ప్రస్తుతం వెంకటగిరితో పనిలేదు. ఇక వైసీపీ అభ్యర్థిగా ఉన్న నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి ఇక్కడ ఇంటిపోరు ఎక్కువైంది. నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తండ్రి మాజీ సీఎం జనార్దన్ రెడ్డి, తల్లి రాజ్యలక్ష్మి.. ఇద్దరూ వెంకటగిరికి ప్రాతినిధ్యం వహించినవారే. ఈ నియోజకవర్గంలో నేదురుమల్లి కుటుంబానికి మంచి పట్టు ఉంది. కానీ రామ్ కుమార్ రెడ్డి హయాంలో మాత్రం ఆ ఫ్యామిలీకి ఉన్న ఓట్లు చెల్లాచెదురయ్యాయి. నేదురుమల్లి అనే బ్రాండ్ ఇక్కడ పెద్దగా పనిచేయట్లేదు. కేవలం జగన్ బ్రాండ్ చూసి మాత్రమే ఓటర్లు వైసీపీవైపు రావాల్సి ఉంటుంది. ఇటీవల టికెట్ల ఖరారు సమయంలో కూడా నేదురుమల్లి వ్యతిరేక వర్గం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దగ్గర పంచాయితీ పెట్టింది. ఆ తర్వాత వైరి వర్గం నేతలు ఏకంగా మీటింగ్ పెట్టుకున్నారు. నియోజకవర్గ వైసీపీ పరిశీలకుడిగా ఉన్న మెట్టుకూరు ధనుంజయ్ రెడ్డి తిరుగుబాటు జెండా ఎగురవేశారు. తాను స్వతంత్రంగా బరిలో ఉంటానన్నారు. ఈ సమస్యను వైసీపీ అధిష్టానం పరిష్కరించాల్సి ఉంది. టీడీపీలో మొన్నటి వరకు టికెట్ పంచాయితీ ఉండేది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి కూడా తనకు వెంకటగిరి కావాలన్నారు. ఆయన ఆత్మకూరుకి వెళ్లిపోవడంతో చివరకు ఇద్దరు ఆశావహులు బరిలో నిలిచారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ప్రధాన పోటీదారుగా డాక్టర్ మస్తాన్ యాదవ్ ఉన్నారు. మస్తాన్ యాదవ్ బీసీ కోటాలో తనకు సీటు కావాలన్నారు. కానీ చంద్రబాబు అనూహ్యంగా వారిద్దర్నీ కాదని కురుగొండ్ల కుమార్తె లక్ష్మి సాయి ప్రియకు టికెట్ ఇచ్చారు. దీంతో మస్తాన్ యాదవ్ హర్ట్ అయ్యారు. ఆయన పార్టీకి రాజీనామా చేశారు. జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. మస్తాన్ యాదవ్ చేరికతో వైసీపీ బలం పెరిగిందని అనుకున్నా.. ఇటు ఇంటిపోరుతో ఆ పార్టీ సతమతం అవుతోంది. ప్రస్తుతానికి వెంకటగిరిలో మహిళా అభ్యర్థిగా లక్ష్మి సాయిప్రియకే మొగ్గు ఎక్కువగా కనపడుతోంది. ఈ దశలో వైసీపీ దిద్దుబాటు చర్యలు చేపడుతుందా..? అసమ్మతి వర్గాన్ని బుజ్జగిస్తుందా..? వేచి చూడాలి. అటు మస్తాన్ యాదవ్ మైనస్ కావడంతో టీడీపీకి కూడా కొన్ని ఓట్లు కోత పడక తప్పదు. ఆ గ్యాప్ ని తెలుగుదేశం ఎలా కవర్ చేస్తుందో చుడాలి

# వాలంటీర్లకు కండిషన్స్ అప్లై

విజయవాడ, మార్చి 29,మరికొన్ని రోజుల్లో ఏపీలో అసెంబ్లీతో పాటు లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎలక్షన్ కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వం, అధికారులు అలర్ట్ అయ్యారు. మరోవైపు వాలంటీర్లను ఎన్నికల పనుల నుంచి తప్పించాలని, వారితో ప్రచారం కూడా చేయించవద్దని ఏపీ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా ఆదేశాలు జారీ చేయడం తెలిసిందే. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న ఏప్రిల్, మే నెలల్లో వాలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్ అందించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వాలంటీర్లకు గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఓ సర్క్యులర్ జారీ చేసింది. ఎన్నికల కోడ్ ఉన్నందున ఆథరైజేషన్ పత్రాలు తీసుకోవాలని వాలంటీర్లకు సెర్ప్ సూచించింది. లబ్ధిదారులకు పింఛన్ ఇచ్చేందుకు బ్యాంకుల నుంచి నగదు తీసుకెళ్లే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్ల వద్ద ఆథరైజేషన్ డాక్యుమెంట్ తప్పనిసరిగా ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వాలంటీర్లు ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించకూడదని పేర్కొన్నారు. మార్చి నెలలో జరిగినట్లు ఏప్రిల్, మే నెలలో చేయకూడదంటూ వాలంటీర్లకు సెర్ప్ కొన్ని సూచనలు చేసింది. పెన్షన్ పంపిణీ చేస్తున్న సమయంలో ఫొటోలు గానీ, వీడియోలు గానీ తీయడం లాంటివి చేయకూడదని వాలంటీర్లకు సూచించింది. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా, ఏ అభ్యర్థికైనా ఓటు వేయాలంటూ లబ్ధిదారులకు చెప్పినట్లు తేలితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. అలాగే ఈసారి పింఛన్ల పంపిణీ కాస్త ఆలస్యం కావొచ్చని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నెల 1వ తేదీన వాలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తుంటారు. అయితే ఈసారి పంపిణీ ఆలస్యం అవుతుందని తెలిపారు. ఏప్రిల్1వ తేదీన కాకుండా ఏప్రిల్ 3న పింఛన్లు పంపిణీ చేస్తారని అధికారులు స్పష్టం చేశారు. లబ్ధిదారులు ఈ అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ నెలకు మాత్రమే ఈ విధంగా ఆలస్యం అవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ నెల పింఛన్ల పంపిణీ ఆలస్యం అవుతాయని అధికారులు పేర్కొన్నారు. మార్చి 31తో 2023–24 ఆర్థిక సంవత్సరం పూర్తికానుంది. మార్చి 31న, ఏప్రిల్ 1న బ్యాంకులుకార్యకలాపాలు సాగించవు. ఈ కారణంతో ఏప్రిల్ 1కి నగదు అందదని, రెండో తేదీన నగదు డ్రా చేసి ఏప్రిల్ 3న పంపిణీ చేస్తారని అధికారులు స్పష్టం చేశారు. ఈ సమాచారాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని పింఛన్ లబ్ధిదారులు సమాచారం అందించాలని తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా పింఛన్ నగదు విత్ డ్రా చేసేందుకు కొన్ని ఇబ్బందుల ఉంటాయని, బ్యాంకు మేనేజర్లతో మాట్లాడి ఇబ్బందులు లేకుండా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వీలైనంత త్వరగా లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేసేందుకు సిబ్బంది అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# ప్రతిపక్ష కూటమిలో ఆగని ఆందోళనలు

ఏలూరు, మార్చి 29, ఏపీ ప్రతిపక్ష కూటమిలో మూడు సీట్లు? ఆరు ఆందోళనలు అన్నట్లుగా నడుస్తోంది. సీనియర్ నాయకులు తమకు టికెట్ రాలేదని మండిపడుతున్నారు. తమ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని కార్యకర్తలూ నిరసనలకు దిగుతున్నారు. ఆత్మహత్యలకూ వెనుకాడబోమని అధినాయకత్వాలను హెచ్చరిస్తున్నారు. సేమ్ ఇలాంటి సీనే జరిగింది అనపర్తిలో. పొత్తులో భాగంగా అనపర్తి సీటు బీజేపీకి వెళ్లిపోవడంతో? మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాత్రికి రాత్రే సీటు గల్లంతవ్వడంతో ఆయన అనుచరులు, పార్టీ కార్యకర్తలు భగ్గుమన్నారు. టీడీపీ బ్యానర్లు, ఫ్లెక్సీలను తగులబెట్టారు. కట్టప్ప రాజకీయాలు వద్దంటూ నినాదాలు చేశారు. తీవ్ర మనస్తాపానికి గురై ఓ కార్యకర్త ఇంటి పైనుంచే దూకే ప్రయత్నం చేయగా? ఇంకో వ్యక్తి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేందుకు యత్నించాడు.ఇక అధిష్టానం నిర్ణయం మార్చుకుని తనకు సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు నల్లమిల్లి. మరోవైపు కొడుకుకి సీటు రాకపోవడంతో? ఆయన తల్లి సైతం కన్నీటి పర్యంతమయ్యారు. బీజేపీ బద్వేల్ సీటు ఆశించిన పనతల సురేష్‌కు పార్టీ షాకివ్వడంతో? ఆయన తన అనుచరులతో కలిసి ఆందోళన చేపట్టారు. విజయవాడలోని పార్టీ ఆఫీసు ఎదుట ప్లకార్డులతో బైఠాయించి ఆందోళన చేశారు. ఇటు అనంతపురం జిల్లా ధర్మవరంలోనూ పొత్తు రాజకీయాలు వేడెక్కాయి. పొత్తులో భాగంగా ధర్మవరం టికెట్‌ను బీజేపీకి కేటాయించడంతో టీడీపీ, జనసేన పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. వరదాపురం సూరి, పరిటాల శ్రీరామ్ అనుచరులు నిరసనకు దిగారు.సీటు రాలేదని నేతలు నిప్పులు చెరుగుతుంటే? మరోవైపు సర్దుబాట్లు చోటుచేసుకున్నారు. మొన్నటివరకు తిరుపతి టికెట్ ఇవ్వలేదంటూ ఆందోళన చేపట్టిన మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సడెన్‌గా కూల్ అయ్యారు. సీటు విషయంలో వెనక్కి తగ్గారామె.. కూటమి అభ్యర్థికి సపోర్ట్ చేస్తానంటూ శాంతించారు సుగుణమ్మ. కూటమిలో సీట్ల ఫైట్‌పై బీజేపీ ఏపీ చీఫ్ పురందేశ్వరి స్పందించారు. టికెట్ ఆశించి రాకపోతే ఎవరైనా ఆందోళనకు గురికావడం కామన్ అన్నారు. ఎవరెలా నిరసనకు దిగినా అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అన్నారామె. మొత్తంగా? సీట్ల పంపకాల విషయం కూటమిలో అగ్గిరాజేస్తోంది. సీటు కావాల్సిందేనని కొందరు పట్టుబట్టి ఆందోళనలకు దిగుతుంటే.. మరికొందరు కాంప్రమైజ్ అయ్యి కూటమి అభ్యర్థినే సమర్థిస్తున్నారు.భూపతి రాజు ఎమోషనల్‌భావోద్వేగానికి ఎవరూ అతీతులు కారు. జీవితంలో అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఎమోషన్ కావడం సర్వసాధారణం. తాజాగా నరసాపురం ఎంపీ టికెట్ దక్కించుకున్న భూపతి రాజు శ్రీనివాస వర్మ భావోద్వేగానికి గురయ్యారు. తన 30 ఏళ్ల కష్టానికి ఫలితం దక్కిందంటూ ఎన్నికల కార్యాలయంలో భావోద్వేగానికి గురయ్యాడు. తాజాగా బీజేపీ ప్రకటించిన ఎంపీ స్థానాల్లో నరసాపురం స్థానం నుంచి భూపతి రాజు శ్రీనివాస వర్మకు టికెట్ దక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తనకు ఎంపీ సీటు దక్కడంపై శ్రీనివా వర్మ భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ టికెట్ ప్రకటించిన వెంటనే పార్టీ కార్యాలయంలో కమలం పువ్వు గుర్తుపై అమాంతం పడిపోయాడు.

# గుడ్ ఫ్రైడే పర్వదినం

ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 29-గుడ్ ఫ్రైడే పవిత్ర పర్వదినం సందర్భంగా నంద్యాల పట్టణంలోని హోలీ క్రాస్ కెథడ్రల్ పెద్ద చర్చి నందు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు గురువులు రెవరెండ్ పాల్ రాజురావ్ ప్రార్థన చేసి ఆశీర్వచనాలు అందించారు. క్రీస్తు యొక్క శుభములు, ఆశీర్వాదాలు అందరిపై ఉండాలని కోరారు.

## నేడు మార్కెట్ గేట్స్, సైకిల్ స్టాండ్ వేలాలు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 29- శనివారం మున్సిపల్ కార్యాలయంలో కూరగాయల మార్కెట్ గేట్లు. సైకిల్ స్టాండ్ వేలాలునిర్వహించ బడునని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. 2024-25 ఆర్థికసంవత్సర మునకుసంబందించినంద్యాల పురపాలక సంఘము ఆధీనం నందుగల డైలీ కూరగాయల మార్కెట్ గేట్స్, కూరగాయల మార్కెట్లోనిసైకిల్‌స్టాండ్,తేది:30-03-2024నఉదయం:11.00 గంటలకు పురపాలక సంఘకార్యాలయం నందు. బహిరంగ వేలంపాటలునిర్వహించబడునని తెలిపారు .సదరు వేలం పాటల యందు పాల్గొనదలచినవారు వివరముల కొరకు కార్యాలయం పనిచేయువేళల యందు రెవెన్యూ విభాగము నందు ఎ1 గుమాస్తా గారిని సంప్రదించవలసినదిగా సూచించారు. మరియు పాటకు 3రోజులముందుగా సాల్వెన్సీ సర్టిఫికేట్లు మరియు ఇతరములును కార్యాలయంనందు దాఖలు పరచవలసినదిగా సూచించారు .

## పన్నులు చెల్లించి వడ్డీ మాఫీ పొందండి :ఆర్ ఓ. వెంకట కృష్ణ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 29-: నంద్యాల మున్సిపాలిటీ కి చెల్లించాల్సిన ఆస్తి,ఖాళీ స్థలాల పన్నుల బకాయిలపై వడ్డీ మాఫీకి గడువు ఈ నెల 31తో ముగుస్తున్నందున బకాయిదార్లు వెంటనే బకాయిలు చెల్లించాలని మున్సిపల్ ఆర్ ఓ వెంకట కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని పన్నుల వసూళ్ల కౌంటర్ల సెలవు దినాల్లో కూడా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేస్తాయన్నారు. బకాయిదారులు వెంటనే చెల్లించి వడ్డీ మాఫీ చేయించుకోవాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ తమ పన్ను బకా యిలు వెంటనే చెల్లించి వడ్డీ మాఫీ ప్రయోజనం పొందాలని ఆయన సూచించారు. పట్టణంలో కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వ బిల్డింగులకు పన్నుల రూపేణా దాదాపు నాలుగు కోట్ల రూపాయలు మున్సిపాల్టీ కి రావలసి ఉందని వారికి నోటీసులు జారీ చేసామని తెలిపారు.

## బద్వేల్ అసెంబ్లీ కూటమి అభ్యర్థి బొజ్జ రోషన్నను భారీ మెజార్టీతో గెలిపించండి

తెలుగుదేశం పార్టీ యువనేత రితేష్ కుమార్ రెడ్డి

వైకాపా నుండి టిడిపిలోకి భారీ చేరికలు

బద్వేలు,అట్లూరు మండల పరిధిలోని కుంభగిరి పంచాయతీ కుంభగిరి గ్రామంలో బద్వేలు నియోజకవర్గ యువనేత రితేష్ రెడ్డి ఆధ్వర్యంలో అధికార పార్టీ వైఎస్సార్ సీపీ లో కీలకంగా పనిచేసిన రాజశేఖర్ రెడ్డి, తిరుపాల్ రెడ్డి , రాజగోపాల్ రెడ్డి తెలుగుదేశం పార్టీలోకి చేరారు, ఈ సందర్భంగా యువనేత రితేష్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు..... యువనేత రితేష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి అభ్యర్థి రోశన్న గారిని గెలిపించే దిశగా ప్రతీఒక్కరూ కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ సూర్యనారాయణ రెడ్డి నందగోపాల్ రెడ్డిఅట్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ రెడ్డి పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆళ్లగడ్డ వైద్యుడు రామ సుబ్రహ్మణ్యంకు అంతర్జాతీయ స్థాయిలో కోఎ అవార్డు

## అవార్డు తీసుకోవడం తనపై మరింత బాధ్యత పెరిగింది

ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 29 విభారె న్యూస్ :- నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ కు చెందిన ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ ఏవి రామసుబ్రహ్మణ్యం అంతర్జాతీయ స్థాయిలో కోఎ అవార్డును అందుకున్నారు. శుక్రవారం వారి నివాసం వద్ద రామసుబ్రహ్మణ్యం ను రౌద్రం మరియు హుబిలక మూవీ టీం సభ్యులు శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. సోరియాసిస్ స్పెషాలిటీస్ (2023-24)కు గాను అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ చర్మవ్యాధి నిపుణులుగా గుర్తింపు పొంది ఈనెల 16న బ్యాంకాక్ లో ప్రముఖ బాలీవుడ్ నటి ఇషాడియల్ నుంచి క్లస్టర్ ఆఫ్ అచివర్స్ ( కోఎ) అవార్డును అందుకున్నారు. డాక్టర్ రామ సుబ్రహ్మణ్యం నివాసం నందు హుబులక మరియు రౌద్రం మూవీ టీం సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఇమ్రాన్ భాష మాట్లాడుతూ ఆళ్లగడ్డ లో వైద్య చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం సృష్టించి సోరియాసిస్ వ్యాధి నిర్మూలనలో ఎన్నో పరిశోధనలు చేసి ఎందరో రోగులకు న్యాయం చేసిన డాక్టర్ రామ సుబ్రహ్మణ్యం సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత డాక్టర్ ఏవి రామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ అవార్డు వల్ల తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. తాను 27 సంవత్సరాల నుంచి వైద్య వృత్తిలో ఉన్నానన్నారు. స్వర్గీయ ఎస్వీపై రెడ్డి తనకు జీవితాన్ని ఇచ్చారని, డాక్టర్ కేర్ హోమియోపతి వారి వల్ల తనకు ఈ ఖ్యాతి దక్కిందన్నారు.



సన్మానిస్తున్న మూవీ టీం సభ్యులు

హోమియోపతిలో ప్రతి ఒక్క జబ్బుకు మందు ఉందన్నారు. సోరియాసిస్ వ్యాధి అంటువ్యాధి కాదని దీనివల్ల భయపడాల్సిన పని లేదన్నారు. హోమియో మందుల ద్వారా సోరియాసిస్ ను సమూలంగా నయం చేయవచ్చన్నారు. 100 మంది సోరియాసిస్ వ్యాధి బాధితులకు హోమియో మెడిసిన్ ద్వారా మంచిగుణం కనిపించిందన్నారు. తెల్ల పొడ వ్యాధికి సంబంధించి మధ్యలో వచ్చితే నయం చేయవచ్చు అన్నారు. పుట్టుకతో వచ్చినట్లయితే నయం చేయలేమన్నారు. త్వరలోనే హైదరాబాదులో క్లినిక్ ను ప్రారంభిస్తామన్నారు. తన విజయానికి కారణమైన ప్రతి ఒక్కరికి ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రౌద్రం మరియు హుబిలక మూవీ టీం సభ్యులు షారుక్, విరేష్, నజీర్, మహమ్మద్ హుస్సేన్, సోను తదితరులు పాల్గొన్నారు

# సత్యవేడులో దూకుడు పెంచిన కోనేటి

సత్యవేడు టిడిపి అభ్యర్థి కోనేటి ఆదిమూలం దూకుడు పెంచారు. సత్యవేడు నియోజకవర్గం టిడిపిలో గత వారం రోజులుగా చెలరేగిన అసంతృప్తి జ్వాలలు ఒక్కొక్కటిగా సర్దుకుంటున్నాయి.టిడిపి నాయకులు కార్యకర్తల ప్రతి ఇంటికీ వెళ్లి, టిడిపిని గెలిపించుకుని చంద్రబాబును ముఖ్యమంత్రి చేద్దామని ఇస్తున్న నినాదం ఆ పార్టీ శ్రేణులలో నూతన ఉత్సహం కలిగిస్తుంది.నియోజకవర్గ టిడిపి అభ్యర్థి, ఎమ్మెల్యే ఆదిమూలం రాజకీయ చాణక్యత, మంత్రాంగం ఫలిస్తుందనే చెప్పుకోవాలి. టిడిపి శ్రేణులందర్ని కలుస్తూ ఏకతాట పైకి తీసుకువస్తున్నారు. . ఆదిమూలం ప్రచారానికి ముందే వేగం పెంచారు. ఆదిమూలం సత్యవేడు మండలంలో మంగళవారం ఎన్ఆర్ అగ్రహారం, దళవాయి అగ్రహారం ప్రాంతాల్లో జోరుగా పర్యటించారు. పార్టీ సీనియర్ నాయకులు సుధా నాయుడు, సురేఖమ్మ, ప్రదీప్, మురళి, బాల, సుబ్రహ్మణ్యం శెట్టి, శోభ, సుబ్బారావు, సత్తార్ సాహెబ్, ఖాదర్ భాయ్, రాజేంద్ర బాబు, పిడి చంద్ర, తదితరులను కలిసి తన గెలుపుకు సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సత్యవేడు మండల పార్టీ అధ్యక్షుడు కె ప్రవీణ్ కుమార్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ పరమశివం, మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, సుందర రామ రెడ్డి ::ూ రెడ్డి కొండూరు బాల రాజు దామోదర రాజు (లతిఇవ సర్పంచ్)ఖ. శన్ముగం , గణేష్ , సురేంద్ర రెడ్డి, మోహన్ , వెంకటేశ్వర్లు దిలీప్, శశిధర్, సెల్వ కుమార్, కోటేశ్వరరావు , చంద్ర యాదవ్ పాల్గొన్నారు

# అసెంబ్లీ కూటమిలో నయా జోష్

## కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న విజయం కాయం అంటున్న రాజకీయ పరిశీలకులు

బద్వేలు ,బద్వేలు అసెంబ్లీ కూటమిలో నయా జోష్ నెలకొంది. కూటమి అభ్యర్థి బొజ్జ రోషన్ననుఓటర్లు తమ కుటుంబ సభ్యుడిగా చూస్తున్నారు. ఆయనను జరగబోయే ఎన్నికల్లో తప్పక ఓట్లు వేసి గెలిపించాలని బద్వేలు నియోజకవర్గ ఓటర్లు పట్టుదలతోఉన్నట్లు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్లు సూర్యనారాయణ రెడ్డి నందగోపాల్ రెడ్డి బద్వేల్ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుర్రంపాటి వెంగళరెడ్డి ధీమా కనపరిచారు.బద్వేలు అసెంబ్లీ కూటమి అభ్యర్థి బొజ్జ విద్యావంతులని ప్రభుత్వ ఉన్నత ఉద్యోగంలో ఉంటూ రాజకీయాల్లోకి వచ్చారని ఆయనకు ప్రజల సమస్యలు బాగా తెలుసునని వారు పేర్కొన్నారు. బొజ్జ వెనుక కొండంత అండగా తెలుగుదేశం పార్టీ స్థానిక మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆమె కుమారుడు పార్టీ యువ నేత రితేష్ కుమార్ రెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలు బిజెపి జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలు కొండంత అండగా ఉండాలని తెలిపారు. అంతే కదా ఇటీవల తెలుగుదేశం పార్టీ యువ నేత రితేష్ కుమార్ రెడ్డి దాదాపు 310 కిలోమీటర్లు పైగా బద్వేలు నియోజవర్గంలో పాదయాత్ర చేసి ప్రజల మద్దతు కూడ కట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మూడు పార్టీలకు బలమైన మద్దతు సైన్యం ఉ ందని అంతేగాక ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజలకు తీవ్రమైన వ్యతిరేకత ఉన్నట్లు తెలిపారు. నవరత్నాలు పేరుతో నవ మోసాలు చేసినట్లు ఆరోపించారు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై వైకాపా పార్టీపై రాష్ట్ర ప్రజలకు నమ్మకం పూర్తిగా పోయిందన్నారు. అలాగే జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న బస్సు యాత్ర సూపర్ ప్లాప్ అయిందని తెలిపారు. బద్వేలు అసెంబ్లీలో కూటమి అభ్యర్థి బొజ్జకు తిరుగు ఉండదని వారు నమ్మకం వ్యక్తం చేశారు. అలాగే బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మూడు పార్టీలకు సంపూర్ణ మద్దతు ఉండడమే గాక వైకాపా నుండి వందల మంది నాయకులు కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరిన విషయాన్ని చేరబోతున్న విషయాన్ని సూర్యనారాయణ 2019 జరిగిన తప్పును 2024 ఎన్నికల్లో ఓటర్లు మరో తప్పు చేయబోరని వారు అన్నారు వైసిపి నిరంకుశ పాలన తుద ముట్టించేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మూడు పార్టీల కలయికను రాష్ట్ర ప్రజలంతా స్వాగతిస్తున్నారని అన్నారు. 2014 ఎన్నికలు తిరిగి రిపీట్ అవుతాయని వారు పేర్కొన్నారు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మరోసారి ముఖ్యమంత్రి కావడం సత్యమని అన్నారు.జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అన్ని వ్యవస్థలు నాశనం అయినట్టు తెలిపారు. ఒక్క ఛాన్స్ పేరుతో పాలనలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసినట్లు ఆరోపించారు. మూడు రాజధానులు కడతానని ఉన్న రాజధానిని నాశనం చేసినట్లు వారు ఆరోపించారు రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల కారణంగా జనసేన బిజెపి పార్టీలతో తెలుగుదేశం పార్టీ పొత్తు పెట్టుకున్నట్లు వార్తలు జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి వేసినట్లు తెలిపారు అప్పుల ఆంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని జగన్మోహన్ రెడ్డి మార్చి వేసినట్లు ఆరోపించారు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కులంతో సంబంధం లేకుండా బీసీ ఎస్సీ మైనార్టీలపై దాడులు పెరిగిపోయినట్లు ఆరోపించారు వైసిపి పాలన అంటే కేవలం జగన్ రెడ్డి విజయసాయిరెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డి ధనుంజయ రెడ్డి మాత్రమే ప్రజలు నమ్ముతున్నారని వారు అన్నారు ఈ ప్రభుత్వంలో బీసీలను ఎంత హీనంగా చూశారు వైసిపి బీసీ సెల్ అధ్యక్షుడు గంగా కృష్ణమూర్తి మాటల్లోనే అర్థమవుతుందన్నారు బీసీలకు తెలుగుదేశం పార్టీ పుట్టిల్లు లాంటిదని జయహో బీసీ కార్యక్రమం ద్వారా రుజువైందన్నారు ఇంత అరాచక జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వచ్చే ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పోటీ చేస్తున్నాయని సూర్యనారాయణ రెడ్డి నంద గోపాల్ రెడ్డి వెంగళరెడ్డి పేర్కొన్నారు.

# ఓటింగ్ శాంతాన్ని పెంచే దిశగా చర్యలు చేపడుతున్నాం

## పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య.

కర్నూలు మార్చి 28:- పాణ్యం నియోజకవర్గంలో ఓటింగ్ శాతాన్ని పెంచే దిశగా స్వీప్ కార్యక్రమాలను చేపడుతున్నామని పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్ లోని మిని కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికల నిర్వహణపై మీడియా ప్రతినిధులతో ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని పాణ్యం నియోజకవర్గ ఆర్వో/జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య నిర్వహించారు.ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గ ఆర్వో / జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ నియోజకవర్గంలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్భయంగా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పాణ్యం నియోజకవర్గం రెండు జిల్లాలలో ఉన్నందున పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్లను కర్నూలు లోనే పాణ్యం నియోజకవర్గం ఆర్వో /జాయింట్ కలెక్టర్ గారు స్వీకరించడం జరుగుతుందన్నారు. పాణ్యం నియోజకవర్గానికి



సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేయడమైనదని, పాణ్యం నియోజకవర్గనికి సంబంధించిన స్ట్రాంగ్ రూములను మరియు కౌంటింగ్ సెంటర్లను రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. పాణ్యం నియోజకవర్గంలో 3,22,494 మంది ఓటర్లు ఉండగా 1,57,113 మంది పురుషులు, 1,65,306 మంది స్త్రీలు, 75 మంది ట్రాన్స్ జెండర్స్ ఉన్నారన్నారు. ఈ నియోజకవర్గంలో మహిళా ఓటర్స్ ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. 18-19 సంవత్సరాల వయసు కలిగిన యువ ఓటర్లు పాణ్యం నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నారని జాయింట్ కలెక్టర్ తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలో 149 లొకేషన్ లో 357 పోలింగ్ స్టేషన్ లు ఉన్నాయని అందులో 214 కల్లూరు, 58 ఓర్వకల్లు, 43 పాణ్యం,42 గడివేములలో ఉన్నాయన్నారు. పాణ్యం నియోజకవర్గంలో 64 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్లుగా గుర్తించడం జరిగిందని, పోలింగ్ స్టేషన్లో అదనపు పోలీసు బలగాలు ఉ ంటాయని, అంతే కాకుండా సీసీ కెమెరాల ను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జడ్పీహెచ్ఎస్ స్కూల్ కస్తూరిబా లోని 2 పోలింగ్ స్టేషన్లను, పాలకొల్లులోని ఒక పోలింగ్ స్టేషన్ ను మొత్తం మూడు పోలింగ్ స్టేషన్లను వల్నరబుల్ పోలింగ్ స్టేషన్లు గా గుర్తించడం జరిగిందన్నారు. రాజకీయ పార్టీల వారు వారి ప్రచారానికి ముందస్తు పర్మిషన్ కొరకు అప్లై చేసుకోవాలన్నారు. అప్లై చేస్తే పర్మిషన్ ఇస్తామన్నారు. ఇప్పటికే దాదాపుగా పర్మిషన్ కొరకు 50 మంది అప్లై చేశారని అందులో 38 వరకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. అత్యవసరం అనుకుంటే ఫిజికల్ గా అప్లై చేసిన అనుమతులు ఇస్తామన్నారు. ఎలాంటి ఉల్లంఘనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఏవైనా కంప్లైంట్స్ ఉంటే సి విజిల్ ద్వారా కంప్లైంట్ చేయవచ్చునన్నారు. కంప్లైంట్ చేసిన 100 నిమిషాల్లోనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190